

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -165 పేజీలు - 8 వెల ₹03/- మంగళవారం 22 సెప్టెంబర్ 2026

టీచర్లపై వైసీపీ దాడి



విజయవాడ సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు బిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు. మిగతా 2లో...



విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం

- తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ



2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి

సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక

వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

కుప్పం సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. మిగతా 2లో...

దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం

దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు



హైదరాబాద్ సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మిగతా 2లో...

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

రంగంలోకి రెవెన్యూ అధికారులు

సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి

మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన

శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన



సిద్దిపేట సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగామిగతా 2లో...

యుద్ధ మేఘాల నీడలో ఐరాసభేటీ..

మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు



ఢిల్లీ సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, మిగతా 2లో...

ఏపీలో జూడాలకు స్టైఫండ్ పెంపు

ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల

పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు

ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం

2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి



అమరావతి సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులుమిగతా 2లో...

జూరాల వద్ద హైటెన్షన్

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్

ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్

గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట



చెరువులకు సొబగులు

పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన

ఫకృద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం

పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ

గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక

రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి



పిఠాపురం సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు మిగతా 2లో...

పట్టణ వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు షెడ్యూల్

41 చోట్ల రేపటి నుంచి 25 వరకు ఇంటింటి సర్వే

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు

26న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన

అభ్యంతరాలు, క్లెయిములకు రెండ్రోజుల సమయం

అక్టోబరు 1న తుది ఓటర్ల జాబితా సమర్పణ

మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు



టీచర్లపై వైసీపీ దాడి



మొదటిపేజీ తరువాయి

శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు.

అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు.సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు.రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

మొదటిపేజీ తరువాయి

తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. "2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

చెరువులకు సొబగులు

మొదటిపేజీ తరువాయి

సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా



జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ



జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పట్టణ వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు షెడ్యూల్

41 చోట్ల రేపటి నుంచి 25 వరకు ఇంటింటి సర్వే

అమరావతి, సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) : రాష్ట్రంలోని 41 పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు ఈనెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఎన్నికల రోల్‌ను వార్డు, పోలింగ్ స్టేషన్ వారీగా విభజించి ఓటర్లను గుర్తిస్తారు. ఎస్టీ ఓటర్లను ఆకుపచ్చ, ఎస్సీ ఓటర్లను ఎరుపు బాల్‌పాయింట్ పెన్‌తో గుర్తించడంతో పాటు మహిళా ఓటర్లను, బీసీ ఓటర్లను నల్ల బాల్ పాయింట్ పెన్‌తో గుర్తించనున్నారు. గుర్తించిన ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్లతో పాటు బీసీ ఓటర్ల ముసాయిదా ఓటర్ల జాబితాలను 26న మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. 27, 28 తేదీల్లో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. క్లెయిమ్ ఫారం-2లో, అభ్యంతరాలు ఫారం-3లో దాఖలు చేయాలి. క్లెయిమ్‌ల జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తారు.అభ్యంతరాలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేస్తారు. 29, 30 తేదీల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ నిర్వహించి ముసాయిదా జాబితాలను సవరిస్తారు. అనంతరం అక్టోబరు 1న ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల తుది వార్డు వారీ జాబితాలను ఫారం-6లో ప్రచురించి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు సమర్పిస్తారు. బీసీ ఓటర్ల జాబితాకూ అదే షెడ్యూల్ వర్తిస్తుంది. మొత్తం ప్రక్రియను 9 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల్లో అమలు కానుంది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురం ప్రాంతాల పరిధిలోని పట్టణ స్థానికసంస్థలు ఇందులో ఉన్నాయి.

ఏపీలో జూడాలకు స్టైఫండ్ పెంపు

మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.

వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ..

మొదటిపేజీ తరువాయి

గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరపున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం: అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా, అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుకే జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాసను విమర్శించే ట్రంప్ కూడా ఏకీభవించడం గమనార్హం.ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో తమ చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనుండగా, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

మొదటిపేజీ తరువాయి

పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

జూరాల వద్ద హైటెన్షన్

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ఆత్మకూరు సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి,





పాణ్యం ప్రతినిధి సెప్టెంబర్ 21, (ప్రజా రిపబ్లిక్ న్యూస్). మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీ గౌరు వెంకటరెడ్డితో కలిసి పాణ్యం మండల పరిధిలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించిన పాణ్యశే నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి.ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై నాయకులతో చర్చించాను. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించాను. సమావేశంలో మండల పరిధిలోని టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, జడ్పీటీసీ నారాయణమ్మ, ఎంపిటిసి సభ్యులు కౌలురు నల్లాల విజయ భాస్కర్ రెడ్డి,రంగా రమేష్ , జయరామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకే పెద్దపీట

స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలి..

గుంతకల్ సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)

గత ఐదేళ్లుగా పార్టీ కోసం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, కేసులకు సైతం వెరవకుండా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన కార్యకర్తలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దపీట వేస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి, వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. కూటమిలో భాగంగా ఎవరికి ఏ అవకాశం వచ్చినా అంతా కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు.

గుంతకల్లు పట్టణంలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం గుంతకల్లు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో పాటు అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు, మాజీ మంత్రి, ఎన్నికల అబ్జర్వర్ ఏరాసు ప్రతాప్‌రెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ అబ్జర్వర్ శ్రీహరిబాబు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, గుత్తిపామిడి ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి రాష్ట్ర



కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. అధికారంలో లేని సమయంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమన్నారు. వారికి అవసరమైన సమయంలో అండగా నిలిచి, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని చెప్పారు.

కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని జయరాం పేర్కొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర స్థానాలకు ఎవరికి అవకాశం వచ్చినా మిగిలిన నాయకులు, కార్యకర్తలు విభేదాలకు తావులేకుండా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. వ్యక్తిగత అభిప్రాయాల కంటే పార్టీ, కూటమి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేసి కూటమి బలాన్ని చాటాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో సాధించే విజయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కానుకగా అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

29 న చాగలమర్రిలో జాబ్ మేళా

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ భార్గవ్ రామ్ దంపతుల ఆధ్వర్యంలో

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తరుపున, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులు మరియు టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ చాగలమర్రి శా. ఎ ఆర్ట్స్ అండ్ కామర్స్ సైన్స్ డిగ్రీ కాలేజ్ నందు 10 కంపెనీలతో 125 జాబ్స్ తో జాబ్ మేళా నిర్వహించనున్నారు, కావున ఆళ్లగడ్డ తాలూకా నిరుద్యోగ యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు.

చెట్టుకు ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిప్పగిరి సెప్టెంబర్ 21,(రిపబ్లిక్ న్యూస్)



చిప్పగిరి మండలంఏరూరు నుండి బంటనహాల్ రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో చిప్పగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతిచెందిన వ్యక్తి వయసు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో అతని పూర్తి వివరాలు, స్వస్థలం తదితర సమాచారం తెలియరాలేదు.మృతదేహం పరిస్థితిని బట్టి సుమారు మూడు నుంచి నాలుగు రోజుల క్రితమే వ్యక్తి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చిప్పగిరి ఎస్సై సి.వి. నరసింహులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చిప్పగిరి పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు, వ్యక్తి ఎలా అక్కడికి చేరుకున్నాడు, మరణానికి గల కారణాలు తదితర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాభివృద్ధి పెంచడమే లక్ష్యం



నంద్యాల, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): విద్యార్థులలో వృత్తి నైపుణ్యాభివృద్ధి అభివృద్ధిని పెంచడం కోసం ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో వృత్తివిద్యా నైపుణ్యం కోర్సులను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సోమవారం నంద్యాల జిల్లా గోస్పాడు మండలంలో ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం కొనసాగుతోంది. ఎస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కి విద్యార్థులు విజిట్ చేయడం జరిగింది.అక్కడ ఉన్న ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ లాబ్స్, మెషిన్స్, కంప్యూటర్ ల్యాబ్ పరిశీలించారు ట్రైనర్ నరేష్ యాదవ్, షైక్ ముక్తార్ హుస్సేన్, కళాశాల బృందం సమక్షంలో ప్రత్యక్షంగా మెషిన్స్ పై, ఏఐ టెక్నాలజీ పై వంటి తదితర అంశాలపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించడంతోపాటు దీనిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అందరూ ఎంతో ఆసక్తితో చక్కగా శ్రద్ధగా విని ఒక నూతన అనుభవాన్ని , అనుభూతిని పొందినట్లు ఈ విజిట్ ద్వారా చాలా అవగాహన కలిగినట్లు తమకు చాలా ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఖజా హుస్సేన్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ విజిట్స్ ద్వారా పిల్లల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందడమే కాకుండా వృత్తి విద్యా కోర్స్ ల పట్ల మరింత ఆసక్తి కలిగి శ్రద్ధతో అభ్యాసం చేస్తారని,ఇది వారికి భవిష్యత్తులో స్వయంఉపాదిగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్ నరేష్ యాదవ్, ముక్తార్ హుస్సేన్, ఇతర పాఠశాల సహాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఎల వినూత్న నిరసన

గుత్తి సెప్టెంబర్ 21(రిపబ్లిక్ న్యూస్)



తమ డిమాండ్ల సాధన కోసం గుత్తి రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్ఎలు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా వీఆర్ఎలు ధ్యానం చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వీఆర్ఎల అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ వీఆర్ఎలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, విధుల్లో ఉండగా వీఆర్ఎ మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలి

డిటి పఠాన్ బాబు కు వినతి పత్రం సమర్పించిన బిజెపి మండల అధ్యక్షులు ఆర్.మురళీమోహన్

పాములపాడు సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్:-వర్షాభావ పరిస్థితులతో పాములపాడు మండలంలోని, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్, పి.ప్రవీణ్ కుమార్ తదితర నాయకులతో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో డిప్యూటీ తహసిల్దార్ పఠాన్ బాబు, అగ్రికల్చర్ ఏవో ఎం.వెంకట మహేశ్వర్ రెడ్డి లకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలోని వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. వర్షాలను నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు తగిన వర్షాలు లేక కొంతమంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారని



పేర్కొన్నారు.

మండలంలోని, పలు ప్రాంతాల్లో పంటల పరిస్థితిని పరిశీలించి, వాస్తవ పంట నష్టాన్ని అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని ఆయన కోరారు. రైతుల పంట నష్టాన్ని శాస్త్రీయంగా నమోదు చేసి, అర్హత ఉన్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

రైతులకు రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించడంతో పాటు పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని కూడా అందించాలని రాయపాటి మురళీమోహన్ ప్రభుత్వాన్ని కోరారు.

కరువు పరిస్థితులపై వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, పొడి పరిస్థితులు, పంట నష్టం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మండల స్థాయిలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శులు పి.ప్రవీణ్ కుమార్, ఆర్. గోపాలకృష్ణయ్య మరియు బిజెపి నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరువుతో అల్లాడుతున్న రైతాంగం

వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి

కరువు దీక్షలో పాల్గొన్న సిపిఐ, -వామపక్షాలు, వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ లు





అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 21,(రిపబ్లిక్ న్యూస్):

ఎల్ నీవో ప్రభావం వల్ల కరువుతో రైతాంగం అల్లాడుతోందని వారిని ఆదుకోవలసిన బాధ్యత మనపై ఉందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టవర్ క్లాక్ వద్ద కరువు దీక్షల కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి మండలాలు,జిల్లా హెడ్ క్వార్టర్స్ లో కరువు దీక్షలు మూడురోజులు నిర్వహిస్తూ...కరువు జాతీయ విపత్తుగా ప్రకటిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రైతాంగానికి కూలీలకు తక్షణ నష్టపరిహారం అందించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి కోరారు.సిపిఐ, వామపక్షాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరువు దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్ గౌడ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, ఏఐటియూసి రాజేష్ గౌడ్, అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, పట్టణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనారాయణప్ప, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం,అరుణోదయ జిల్లా అధ్యక్షుడు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

కంటనీరు పెడుతూ రైతు కుంగిపోతున్నాడు

ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నీ వో వస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యం చేయడం వల్ల రైతాంగం, కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రైతాంగం వేసిన వంటలకు వర్షాలు లేక ఎల్ నీ వో విపత్తు వల్ల రైతులు వేసిన పంటలు అనేక రూపాలలో దెబ్బతీశాయి.అనేక రకాలుగా రైతులు నష్టపోయి, చీనీ,కంది,వేరుశనగ అనేక రకాల చిరుధాన్య పంటలు వర్ధబావం వల్ల అనేక రూపాలలో రైతులు నష్టపోవడం జరిగింది.అదే ప్రధానంగా పశువులకు మేత లేక గ్రామీణ ప్రాంతాల్లో రైతులు అక్కడుతూ మెతలేక పాడి పశువులను సంతలకు తీసుకొస్తే లక్ష రూపాయలకు విక్రయించే పశువులను 20 వేలకు ,30 వేలకు అడిగేవారు లేక పశువులను మేపలేక కసాయి వాళ్లకు అమ్మలేక ... కంటనీరు పెడుతూ రైతు కుంగిపోతున్నాడు.కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పశు గ్రాసం గ్రామీణ ప్రాంతాలకు అందులేకపోవడంతో రైతాంగం దెబ్బతింటోంది.పంజాబ్ రాష్ట్రంలో పంటపొలాల్లో పశుగ్రాసం రైతులు పొలాల్లోనే కాల్ చేస్తున్నారు. ఆ మేతను కరువు ప్రాంతాలకు ఎగుమతి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

కరువు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలకు నీళ్లు బంద్

హంద్రీనీవాకాలువ 1000 క్యూసెక్కుల నీటిని తీసుకురావాలని, పునరుద్ధరిస్తామని చెబుతూ ట్రిబులింజన్ సర్కార్ చేసిన వాగ్దానాలను తుంగలితొక్కి హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేయడంవలన రైతాంగం కాలువ సమీపంలో ఉన్నా బోరుబావులన్నీకుడా ఎండిపోవడంహరిగింది.ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతాంగం అంతా కూడా బోరుబావులు నమ్ముకొని వేసిన పంటలన్నీ ఎండిపోవడం జరిగింది.అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన చేసిన వాగ్దానానికి కుప్పం వరకూ నీళ్లు తీసుకొస్తానని చెప్పిన వాగ్దానాన్ని పట్టుకొని కరువు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను బంద్ చేసి నీళ్లు తరలిస్తున్నారు.

" పురుగుమందే పెరుగన్నమై "

కరువు రాయలసీమ నుంచి కేంద్రానికి అనేక రకాలైన పండ్లను ఎగుమతిచేయడం జరిగింది.అయితే ఇపుడు రాయలసీమలో ప్రధాన ప్రాణధాతైన హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేయడంవలన హంద్రీనీవా పరిసర ప్రాంతాల్లో ఉన్న బోరు బావులు కర్నూలు నుంచి కుప్పం వరకు నీళ్లు తీసుకోవడం వల్ల కర్నూలు,కడప,అనంతపురం జిల్లాలలో పండ్ల తోటలన్నీ కూడా ప్రధానంగా చీనీ,దానిమ్మ, అరటి,బొప్పాయి,కరుబుజ,కళింగర తదితర పండ్లతోటలు నీళ్ళులేక ఎండిపోవడం జరిగింది.ఈ జరిగిన పరిణామాలన్నీ రైతులు భరించలేక " పురుగుమందే పెరుగన్నమై " రైతులు ఆ వైపు చూడడం తప్పలేదు.అదే శరణం అనుకుంటున్నారు.అప్పులు చేసి దిక్కుతోచక ఆత్మహత్యలే శరణ్యం అనుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో వామపక్షాలు,ప్రజాసంఘాలు,పౌర సమాజం అంతాకలిసి రైతులకు వెన్నుదన్నుగా నిలిచి భవిష్యత్ లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలించడానికి రైతులు, కూలీలు అనుబంధ సంఘాలు కలిసి పెద్ద ఎత్తున రైతుల తరపున పోరాటం చేయాలని కోరారు.

జెడ్పీ కార్యకలాపాలకు నంద్యాలలో తాత్కాలిక కార్యాలయ ఏర్పాట్లు

అనువైన భవనం, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి







నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 21 (రిపబ్లిక్ న్యూస్)

జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యకలాపాలను నంద్యాల నుంచే సజావుగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాలయ వసతులను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుత జెడ్పీ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబరు 24తో ముగియనుండగా, సెప్టెంబరు 25 నుంచి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించనున్న నేపథ్యంలో జెడ్పీ కార్యాలయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జెడ్పీ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు నంద్యాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలు, వసతులను జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆడిట్ కార్యాలయ ప్రాంగణాల్లో అందుబాటులో ఉన్న గదులు, కార్యాలయ నిర్వహణకు అనువైన వసతులు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. నూతన జెడ్పీ భవనం అందుబాటులోకి వచ్చే వరకు అనువైన తాత్కాలిక భవనంలో కార్యాలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 25 నుంచి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో జెడ్పీ కార్యకలాపాలు కొనసాగనున్న నేపథ్యంలో డిప్యూటీ సీఈఓ, అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు సుమారు 50 మంది సిబ్బంది కర్నూలు నుంచి నంద్యాలకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన కార్యాలయ గదులు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను సమకూర్చేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పట్టు వీడని జేసీ

ఇద్దరి సబ్‌రిజిస్ట్రార్ లపై సస్పెన్షన్ వేటు

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లపై ధర్నా

డీఐజీ కార్యాలయం ఎదుట ఆందోళన

ఉత్తర్వులు రావడంతో విరమణ



సస్పెన్షన్ ఉత్తర్వులు రావడంతో ఆందోళన విరమణ

అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):

నిషేధిత జాబితాలో ఉన్న భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడాన్ని జేసి ప్రభాకర్ రెడ్డి తప్పుపట్టారు. అక్రమార్కులతో చేతులు కలిపి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, ముడుపులు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేయడాన్ని జేసి ఖండించారు. సోమవారం ఉదయం రిజిస్ట్రేషన్ శాఖ ముందు బైఠాయించారు.అందులో భాగంగా తాడిపత్రి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో సబ్‌రిజిస్ట్రార్ లు అయిన మంజునాథ్, బసవరాజు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. సబ్‌రిజిస్ట్రార్ పై సస్పెన్షన్ ఉత్తర్వులు వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. చివరకు సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడటంతో ధర్నాను విరమించారు.

తాడిపత్రి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40 కోట్ల విలువైన 6 ఎకరాల 70 సెంట్ల ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని జేసీ ఆరోపించారు. సర్వే నంబర్లు 683ఏ, 683బీ1, 683బీ పరిధిలోని సుమారు 6 ఎకరాల 75 సెంట్ల ప్రభుత్వ భూమిని వైఎస్సార్‌సీపీ నేతలు అక్రమంగా ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, వీఆర్వో వెంకటస్వామి, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ సఫీలపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు జేసీ తెలిపారు. అయితే ఇదే వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్‌రిజిస్ట్రార్ లు బసవరాజు (కణేకల్), మంజునాథ్ (గుత్తి) విధుల్లో కొనసాగుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.దీంతో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన జేసీ.. సస్పెన్షన్ ఉత్తర్వులు వచ్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. చివరకు బసవరాజు,మంజునాథ్ ల పై సస్పెన్షన్ ఉత్తర్వులు రావడంతో ఆందోళన విరమించారు. ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జేసీ డిమాండ్ చేశారు.

రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యం

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రూ.27.75 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):

రాయలసీమ ఇక వెనుకబడిన ప్రాంతం కాదని.. అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్న " రైజింగ్ రాయలసీమ " అని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆదివారం 36వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 39 మందికి రూ.27.75 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల భూములకు రక్షణ లేకుండా పోయేది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 752 మందికి రూ.7.40 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ సాయం అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కేవలం రూ.85 లక్షలు మాత్రమే సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించారని మండిపడ్డారు. రాష్ట్రంలోని వ్యవస్థలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ప్రజలు వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేశారని దగ్గుపాటి వ్యాఖ్యానించారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రజల భూములకు రక్షణ లేకుండా పోయేదన్నారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు.విద్యా రంగంలో మంత్రి నారా లోకేశ్ అనేక మార్పులు తీసుకొచ్చారని, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి వివాదాలకు తావులేకుండా భర్తీ చేశారని పేర్కొన్నారు.

రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

అయితే వైసీపీ నాయకులు ఇప్పుడు దీనిపై విమర్శలు చేస్తున్నారని, గతంలో అధికారంలో ఉండగా ఉపాధ్యాయులను అవమానించి.. ప్రస్తుతం ఉద్యోగాలు పొందిన వారినీ నిందించడం సరికాదని అన్నారు.రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. హంద్రీనీవా కాలువను రూ.3,500 కోట్లతో విస్తరించి కుప్పం నుంచి మడకశిర వరకు నీటిని తీసుకెళ్లేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. రాయలసీమకు రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతపురం నియోజకవర్గంలోనూ గత రెండేళ్లలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తు జిల్లాగా ప్రకటించాలని సామూహిక దీక్ష



గుత్తి సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)

అనంతపురం జిల్లాను వెంటనే జాతీయ విపత్తు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ, సీపీఎం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, అఖిల భారత రైతు కూలీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రామాంజనేయులు, ఐద్వా మండల కార్యదర్శి రేణుక, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరాముడు, పట్టణ కార్యదర్శి రాజుయాదవ్, సహాయ కార్యదర్శి నజీర్, కుల సంఘం నాయకుడు మల్లికార్జున, సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరసింహయ్య, సీనియర్ నాయకులు బి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, రామాంజనేయులు, ధనుంజయ, షఫీ, టీఎం బాషా, బెస్త శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీపీటీఓను కలిసిన ఆర్టీసీ బీసీ ఉద్యోగులు



కదిరి సంక్షేమం, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):

శ్రీ సత్యసాయి జిల్లా ఆర్టీసీ డీపీటీఓ మధుసూదన్‌ను కదిరి ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను డీపీటీఓ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.సంఘం డిపో అధ్యక్షుడు శంకరప్ప, కార్యదర్శి పాలెం సురేంద్ర, కోశాధికారి కాళసముద్రం హరికుమార్, ప్రచార కార్యదర్శి సింహ, ఉప కార్యదర్శి శివయ్య తదితరులు డీపీటీఓను కలిశారు. అనంతరం పీఓ ఉషారాణి, అసిస్టెంట్ మేనేజర్ (స్క్వాడ్ ఇన్‌చార్జి) హరితను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.ఆర్టీసీ బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారితో చర్చించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



గుత్తి సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)

పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సోమవారం గురజాడ అప్పారావు 164వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచయితగా, సంఘ సంస్కర్తగా, సాహితీవేత్తగా, హేతువాదిగా, అభ్యుదయవాదిగా సమాజానికి సేవ చేశారని తెలిపారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసి తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. ఆయన రచించిన 'కన్యాశుల్కం' నాటకానికి సాహితీ లోకంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు.గురజాడ అప్పారావు సాహిత్య రంగానికి చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణశెట్టి, నారాయణరెడ్డి, దేవదాస్, వేణుగోపాల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురాన్ని జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించాలి



గుంతకల్ సెప్టెంబరు 21: రిపబ్లిక్ న్యూస్

అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించి, కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతిరెడ్డి డిమాండ్ చేశారు. కరువు సమస్యపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సామూహిక దీక్షలు ప్రారంభించారు.

21 నుంచి 23 వరకు మూడు రోజులపాటు నిర్వహించే దీక్షలకు సీపీఐ, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర పార్టీలు మద్దతు తెలిపాయి. ముఖ్య అతిథిగా హాజరైన నైరుతిరెడ్డి దీక్షలను ప్రారంభించి, పాల్గొన్న వారికి పూలమాలలు వేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీరు, పశువులకు నీరు, మేత కొరత వంటి సమస్యలు కూడా నెలకొన్నాయని చెప్పారు. కరువు ప్రభావంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితులను పరిశీలించి జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం, పంట నష్టపరిహారం అందించాలని, రుణ ఉపశమనం కల్పించడంతో పాటు సాగునీటి వసతులు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ముప్పుగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎంఈఓకు బహుజన సేన సమితి వినతి



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 21 (ప్రజారిపబ్లిక్ న్యూస్):

కోటేకల్లు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బహుజన సేన సమితి నాయకులు సోమవారం మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం. జెట్టప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెట్టప్ప మాట్లాడుతూ కోటేకల్లు గ్రామంలోని వీఎస్‌బీఎస్, తెలుగు నారాయణ పాఠశాలలు సరైన భవనాలు లేకుండా రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. విద్యార్థులకు తగిన గాలి, వెలుతురు, తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం వంటి కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. పాఠశాలల భద్రతా ప్రమాణాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే సంయుక్త తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బహుజన సేన సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వత డీఎస్పీని నియమించాలి

అట్రాసిటీ బాధితులకు ఇబ్బందులు

వెంటనే నియమించాలని సమతా సైనిక్ దళ్ డిమాండ్



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 21 ప్రజా రిపబ్లిక్ న్యూస్): ఎమ్మిగనూరు పోలీస్ డివిజన్‌కు నెలలుగా శాశ్వత డీఎస్పీ లేకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా అట్రాసిటీ కేసుల బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షుడు పరమేష్, జిల్లా అధ్యక్షుడు రాముడు తెలిపారు. పత్తికొండ డీఎస్పీకి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల రెండు డివిజన్ల ప్రజలకు సకాలంలో పోలీసు సేవలు అందడం కష్టంగా మారిందన్నారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికంగా శాశ్వత డీఎస్పీ అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. శాంతిభద్రతలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, కేసుల పర్యవేక్షణ కోసం ఎమ్మిగనూరు డివిజన్‌కు వెంటనే శాశ్వత డీఎస్పీని నియమించాలని జిల్లా ఎస్పీ, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. జాప్యం జరిగితే ప్రజలు, దళిత సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

పిడుగుపాటుతో ఇద్దరు మహిళలు మృతి

మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్



ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్21(రిపబ్లిక్ న్యూస్) కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామంలో పిడుగు పడిన సమయంలో విద్యుత్ ప్రభావానికి గురై ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల అధ్యక్ష కార్యదర్శి సుధాకర్ రమేష్ అన్నారు..ఈ ఘటనలో పింజరి మురుతుజాబి, పింజరి మహబూబీ అనే ఇద్దరు మహిళలు మృతి చెందడం బాధాకరమన్నారు. పిడుగుపాటు సమయంలో విద్యుత్ ప్రభావం కారణంగా వారు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని పేద కుటుంబాలకు చెందిన మహిళలు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మృతి చెందిన పింజరి మురుతుజాబి, పింజరి మహబూబీ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సహాయ సహకారాలను వెంటనే అందించాలని సంబంధిత అధికారులు గ్రామానికి వెళ్లి పరిస్థితి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలి ఇదుర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 105 ఫిర్యాదులు

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడండి - జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్

చట్ట పరిధిలో సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు





నంద్యాల క్రైం, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ ఫిర్యాదిదారుల నుంచి 105 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి అండగా నిలిచిన శేఖర్‌కు సన్మానం



ఎమ్మిగనూరు, సెప్టెంబర్, 21,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)
తమ కుమారుడికి జరిగిన ప్రమాద ఘటనలో పోలీసు కేసు విషయంలోనూ, ఆర్థిక సహాయం అందించడంలోనూ న్యాయం జరిగేలా సహకరించిన శేఖర్‌ను బాధిత కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి అండగా నిలిచి సమస్య పరిష్కారానికి సహకరించినందుకు శేఖర్‌కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భక్తి మార్గంలో విట్టల్ నగర్
వైభవంగా వినాయక చవితి వేడుకలు

గణనాథునికి నిత్య పూజలు.. దర్శనానికి పోటెత్తుతున్న భక్తజనం

కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్21 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు నగరంలోని విట్టల్ నగర్‌లో వినాయక చవితి వేడుకలు భక్తి మార్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. గణనాథుని విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రతిష్ఠించిన నిర్వాహకులు ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, పూజలు, హారతులు నిర్వహిస్తుండటంతో విట్టల్ నగర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులు గణనాథునికి పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు సమర్పిస్తూ తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు,



సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థిస్తున్నారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటుండటంతో ప్రాంతమంతా భక్తి సందడితో కళకళలాడుతోంది.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుని కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పార్వతి, ఉమాదేవి, సావిత్రి, రమాదేవి, శిరీష, లతా, వీణ, నీలాంచిక, రాజేశ్వరి, కళ్యాణమ్మ, రాజలక్ష్మి, మాధవి, వరలక్ష్మి, జయలక్ష్మి, శ్రీలక్ష్మి, భాను, సన్నీ, ప్రదీప్, మల్లికార్జున, చంద్రమోహన్, రామయ్య చౌదరి, శోభారాణి, సాయి చరణ్, ఈశ్వర్, హరి, అరుణ్, నాగేంద్ర, చైతన్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు గణేష్ నిమజ్జనానికి 1,700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

ట్రాఫిక్ మళ్లింపులు.. అదనపు నిమజ్జన ఘాట్ల ఏర్పాటు । అప్రమత్తంగా విధులు నిర్వహించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 21)
కర్నూలు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. నిమజ్జన మార్గాలు, ఘాట్ల వద్ద సుమారు 1,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమై విధులపై దిశానిర్దేశం చేశారు. శోభాయాత్ర మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉదయం 9 గంటలకు శోభాయాత్ర ప్రారంభం

కర్నూలు వన్‌టౌన్ పరిధిలోని రాంభొట్ల దేవాలయం పరిసరాల నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు నిమజ్జన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎస్పీ తెలిపారు. నగరంలో 1,000కు పైగా గణేష్ విగ్రహాలు ఉన్న నేపథ్యంలో సాధారణంగా వినాయక్ ఘాట్‌లో జరిగే నిమజ్జనంతో పాటు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో అదనపు నిమజ్జన ఘాట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
నంద్యాల, కడప, అనంతపురం జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నిరంతరాయంగా బందోబస్తు కొనసాగుతుందని తెలిపారు.



నిమజ్జన ఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి
నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో నీటి ప్రవాహం, లోతు ఎక్కువగా ఉన్నందున భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించాలని, పిల్లలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు విధులు కేటాయించిన ప్రాంతాల్లోనే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయని ఎస్పీ తెలిపారు. భారీ వాహనాలకు నగరంలో అనుమతి ఉండదని, అవసరాన్ని బట్టి ప్రధాన రహదారులపై వన్‌వే విధానం అమలు చేస్తామని చెప్పారు. కొన్ని మార్గాల్లో ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు.
సీ క్యాంప్ నుంచి పెద్ద సంఖ్యలో గణేష్ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున హైవే దాటి గణేష్ ఘాట్‌కు చేరుకునే మార్గాల్లో ప్రత్యేక ట్రాఫిక్, భద్రతా చర్యలు



చేపట్టినట్లు తెలిపారు.

డీజేలకు నిబంధనలు తప్పనిసరి

నిమజ్జన వేడుకల్లో డీజేలను నిబంధనలకు లోబడి నిర్వహించాలని, నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.
పోలీసు సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా, అత్యుత్సాహానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. భక్తులు, ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.
కార్యక్రమంలో నంద్యాల ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్, అదనపు ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ, హోంగార్డులతో పాటు కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

జిల్లాలో రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రతి నియోజకవర్గంలో హెలిప్యాడ్ కు అనువైన స్థలాలను మందస్తుగా గుర్తించాలి

ప్రభుత్వ భూముల రికార్డులను పక్కగా భద్రపరచాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న భూముల రీసర్వే, వెబ్‌ల్యాండ్ 2.0, పట్టా పుస్తకాల పంపిణీ ప్రక్రియను, ప్రతి నియోజకవర్గంలో హెలిప్యాడ్ కు అనువైన స్థలాలను మందస్తుగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫ్రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, ఐ విఆర్ఎస్, 22ఎ, రెవెన్యూ వన్ , ఓ ఆర్ ఎం ఎస్ , పి జి ఆర్ ఎస్, హై సెట్స్ తదితర అంశాలపై ఆర్డీవోలు, తాసిల్దార్లు లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించిన డిజిటల్ సంతకాల ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని ఖాతాలకు డిజిటల్ సంతకాలను పూర్తి చేయాలని సూచించారు. డిజిటల్



సంతకాల ప్రక్రియ పూర్తయిన వెంటనే పాస్ పుస్తకాల ముద్రణ, పంపిణీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు.పెండింగ్ ఖాతాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎటువంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పట్టాదారు పాస్ పుస్తకాలు త్వరితగతిన అందేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో 22ఎ జాబితా సవరణ 22ఎ కు సంబంధించి అందిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై తాజా పురోగతిని అధికారులు వెల్లడించారు. దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి, అర్హత కలిగిన వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.ప్రజల నుంచి అందుతున్న అర్జీలను సమగ్రంగా పరిశీలించి సకాలంలో



పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు పెండింగ్ అర్జీలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అనవసర జాప్యానికి తావులేకుండా పరిష్కార ప్రక్రియను వేగవంతం తెలిపారు. అందరికీ ఇల్లు పథకంలో భాగంగా జిల్లాలోని వివిధ డివిజన్లో లేఅవుట్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన అన్ని విధాలుగా సౌకర్యవంతమైన స్థలాన్ని ముందుగానే గుర్తించాలని తెలిపారు. గుర్తించిన స్థలాల వివరాలను సంబంధిత రికార్డులు నమోదు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పర్యటనకు సర్వం సిద్ధం

రాప్తాడు పసుపుమయం - భారీగా టీడీపీ శ్రేణుల సమీకరణ

నేడు ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ -కార్యకర్తలతో సమావేశం





రాప్తాడు సంక్షేమం, సెప్టెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):
రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ మంగళవారం రాప్తాడులో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి టీడీపీ నేతలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రం పసుపుమయంగా మారింది. లోకేశ్‌కు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సమీకరించేందుకు సిద్ధమయ్యాయి.

ఎన్టీ రామారావు,పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ

రాప్తాడుకు చేరుకున్న అనంతరం లోకేశ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమై ప్రసంగించనున్నారు.పర్యటన ఏర్పాట్లను ఉమ్మడి అనంతపురం జిల్లా జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎంపీ పార్థసారథి, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు పరిశీలించారు. విగ్రహాల ఆవిష్కరణ వేదిక, కార్యకర్తల సమావేశ స్థలం, భోజన ఏర్పాట్లు, పార్కింగ్ తదితరాలను పరిశీలించి సూచనలు చేశారు.ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో రాప్తాడులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ జెండాలతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. " జై నారా లోకేశ్.. జై తెలుగుదేశం " నినాదాలతో రాప్తాడు మారుమోగింది.లోకేశ్ రాక కోసం నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ, కార్యకర్తల సమావేశానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.

ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో విగ్రహాల ఏర్పాటు

పార్టీ కార్యకర్తలకు లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని ఎంపీ పార్థసారథి అన్నారు. విద్యాశాఖలో మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి రాప్తాడుకు వస్తున్నందున పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయని చెప్పారు.స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారని జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.
ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ప్రతి కార్యకర్తదిగా భావిస్తున్నారని పరిటాల శ్రీరామ్ అన్నారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో విగ్రహాల ఏర్పాటు జరిగిందని తెలిపారు. మంగళవారం కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు తరలిరానున్నారని చెప్పారు.

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

హక్కులను తెలుసుకుని పరిరక్షణ కోసం ముందుకు రావాలి...

- రేణిగుంట మానవ హక్కుల మండల చైర్మన్ : వాసురు సుబ్రహ్మణ్యం

రేణిగుంట సెప్టెంబర్ :21(రిపబ్లిక్ న్యూస్)

ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని, హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జిహెచ్ఆర్ఏఏ పిలుపునిచ్చింది. "మీ హక్కులు తెలుసుకోండి... హక్కులపై పోరాడండి" అనే నినాదంతో ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు సంఘం కృషి చేస్తోందని ప్రతినిధులు తెలిపారు.భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, గౌరవప్రదమైన జీవనం వంటి అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని సంఘం పేర్కొంది. హక్కుల గురించి తెలియకపోవడం వల్ల అనేక సందర్భాల్లో ప్రజలు తమకు ఎదురైన అన్యాయాన్ని ప్రశ్నించలేకపోతున్నారని తెలిపింది.మానవ హక్కుల ఉల్లంఘనకు గురైన బాధితులకు అండగా నిలిచి, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని జిహెచ్ఆర్ ఏఏ ప్రతినిధులు తెలిపారు. వేధింపులు, వివక్ష, అన్యాయం, అక్రమాలు లేదా ఇతర



హక్కుల ఉల్లంఘనలను ఎదుర్కొంటున్న వారు భయపడకుండా సంబంధిత అధికారులను ఆశ్రయించాలని సూచించారు.ప్రజల్లో హక్కులపై చైతన్యం పెంచేందుకు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. హక్కులతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతలను కూడా తెలుసుకోవాలని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ సమాజంలో న్యాయం, సమానత్వం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



"హక్కులు తెలుసుకుంటే బాధ్యత గుర్తిస్తుంది. దేశ పౌరులుగా తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని వాటి పరిరక్షణకు కృషి చేయాలి" అని జిహెచ్ఆర్ఏఏ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలం చైర్మన్ వాసూరు సుబ్రమణ్యం, మహిళా చైర్మన్ కుసుమ కుమారి, జిల్లా చైర్మన్ నాగరాజు, బి. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో మానవ హక్కులపై మరింత అవగాహన కల్పించేందుకు నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

కోర్టు పరిధిలో ఉన్న భూమిలో బోర్లు వేస్తారా?

రైల్వే కోడూరు సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్.

చిట్వేల్ మండలం తిమ్మయ్యపాలెం పంచాయతీలో ఉన్న సర్వే నంబర్ 62లోని భూమి కోర్టు పరిధిలో విచారణ కొనసాగుతుంటే బోరు వేయడంపై నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి పాపిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

తమ పేర్లపై ఈ భూమికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, భూమిపై కోర్టులో విచారణ నంబర్ 144 సెక్షన్‌లో కొనసాగుతున్న సమయంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా బోరు వేస్తున్నారని వారు ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద భూమిలో ఈ విధంగా పనులు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు,ఎందుకు స్పందించడం లేదని వారు



ప్రశ్నించారు.రాజకీయ నాయకుల అండదండలతోనే తమ భూమిలో అడ్డు అదుపు లేకుండా బోరు వేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తూ, అధికారులు నిద్రమత్తు వదలి వివాదాస్పద భూమిలో, అదీ కోర్టు పరిధిలో ఉన్న భూమిలో జరుగుతున్న పనులను ఆపి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు, అసలు అధికారులు ప్రజల రైతుల పనులు పరిష్కరించడంలో ఉన్నారా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు విచారణలో ఉన్న భూమిపై యథేచ్ఛగా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

తమ వద్ద భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న వారు, ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు.

నల్లపురెడ్డిపల్లిలో శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయానికి శంకుస్థాపన.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్.పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన సాయి వికాస్ రెడ్డికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిర్మించనున్న నూతన ఆలయంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెరగనుందని నిర్వాహకులు తెలిపారు.అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను గ్రామస్తులు సాయి వికాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు, పాఠశాల సమయాలకు అనుగుణంగా బస్సు టైమింగ్స్ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలకు బాల్య వివాహాలపై అవగాహన

ఓర్వకల్ గ్రామం నందు కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన





ఓర్వకల్ సెప్టెంబర్,21(రిపబ్లిక్ న్యూస్)

పంచాయితీ సెక్రెటరీ ఏ గిరిధర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి నేటి బాలలు రేపటి పౌరులు జీవితంలో ఎదగాలంటే బాల్యం అనేది చాలా ముఖ్యమైన పాత్ర బాల బాలికలకు అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలి లేనిచో వివాహం చేసినట్లయితే తల్లిదండ్రులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష దీనితోపాటు లక్ష రూపాయల జరిమాణం విధించును పెళ్లి నిర్వాహకులు మద్దతుదారులు కళ్యాణ మండపం వారు పురోహితులు లేదా పాస్టర్లు మత పెద్దలు వంటవారు టెంట్ హౌస్ వారు బ్యాండ్ మేళం వారు వీరందరూ కూడా శిక్షకు అర్హులు అని వివరించారు సి లలిత జి ఎం ఎస్ కే వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు అమ్మాయికి వివాహం చేసినట్లయితే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది కాబట్టి గ్రామ పెద్దలు ఇట్టి విషయాన్ని గమనించగలరు అని వివరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏ గిరిధర్ పంచాయతీ సెక్రెటరీ సి లలిత మహిళా పోలీస్ కే వెంకటేశ్వరమ్మ అంగన్వాడి టీచర్ పి.వి రాధమ్మ అంగన్వాడి టీచర్ యం మల్లమ్మ అంగన్వాడి టీచర్ ఎం మంగమ్మ అంగన్వాడి టీచర్ గ్రామ పెద్దలు బాలల తల్లిదండ్రులు యూత్ సంఘం లీడర్లు మహిళా సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

రైతు సంఘాల డిమాండ్.



రైల్వే కోడూరు సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్.

చిట్వేల్ మండల పరిధిలోని భూ సమస్యలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉచిత పంటల బీమా తదితర రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు,సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల తహసిల్దార్ నరసింహారావు కి రైతులతో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు, ఈ సందర్భంగా పందికాళ్ళ మణి మాట్లాడుతూ మండల పరిధిలోని భూ సమస్యలు పంటలకు గిట్టుబాటు ధరలు మరియు ఎరువులకు రకరకాల యాప్ లు వలన రైతులు ఎరువులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు అలాగే రైతులకు భూములు ఉన్న ఈ కేవైసీ అని వేలిముద్రలు అని ఆధార్ కార్డు లింక్ లేదని ఇలా రకరకాల కారణాలతో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ సంక్షేమ పథకాలు రైతులకు అందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేశారు, కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి ఎరువులు కు సంబంధించిన యాప్ లను వెంటనే రద్దు చేయాలి 22 ఏ భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి భూములు ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభ, పీఎం కిసాన్ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శంకరయ్య,ఒలిమి నాగయ్య,వేమన తిరుపయ్య,జ్యోతి నాగేష్,ఏ సుజాతమ్మ, రైతులు సుబ్బరాయుడు, చలపతి రాజు మారే ఉదయ్ కుమార్ సట్టి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పనిసరి: సీఐ సాయి ప్రసాద్

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 21 రిపబ్లిక్ న్యూస్



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ సూచించారు. సోమవారం చౌడేపల్లి – పలమనేరు ప్రధాన రహదారిలోని చిట్రెడ్డిపల్లి వద్ద పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు.

ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ప్రయాణికులను ఆపి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం వారికి హెల్మెట్ వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణంలో చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఎక్కే ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించాలన్నారు.

ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు కాకుండా హెల్మెట్ ఎంతగానో కాపాడుతుందని, పోలీసుల జరిమానాల కోసం కాకుండా ప్రాణ రక్షణ కోసమే హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. రూల్స్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి మందిరములోఅంగరంగ వైభవంగా ముగిసిన ఎనిమిదో రోజు వినాయకుని పూజ.

సంగారెడ్డి/ఆందోల్/సెప్టెంబర్ 21/ప్రజా రిపబ్లిక్



సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల్ జోగిపేట పట్టణంలో శ్రీ వేణుగోపాల స్వామి మందిరంలో కొలువుతీరిన భారీ గణనాథుని ఈరోజు అన్నపూర్ణేశ్వర స్వామి వారి అవతారంలో దర్శనమిచ్చిన లంబోదరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అతినారం సబితా నరేష్ యాదవ్ దంపతులచే పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు భక్తులు వేణుగోపాల స్వామి భక్త బృందం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

రాయికల్ మండలంలో 918 కొత్త పెన్షన్ దరఖాస్తుల వెరిఫికేషన్

రాయికల్ మండలం సెప్టెంబర్21(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియడంతో రైకల్ మండలంలో వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు, మండల వ్యాప్తంగా మొత్తం 918 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు, దరఖాస్తుల పరిశీలనలో ఎంఈవో, అగ్రికల్చర్ అధికారి, ఏయి ఇరిగేషన్ తోపాటు పలువురు అధికారులు భాగస్వాములై పనిచేస్తున్నట్లు వెల్లడించారు, వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 25 లోగా పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ఘనంగా మిరియాల బాబా గౌసియా ఆశ్రమం పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ ఖాదరీ జన్మదిన వేడుకలు....

రేణిగుంట సెప్టెంబర్ :21(రిపబ్లిక్ న్యూస్)



మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ ఖాదరీ పుట్టిన రోజు వేడుకను ఆశ్రమ శిష్య బృందం సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఆశ్రమంలో తమ ఆధ్యాత్మిక గురువు గౌసియా ఆశ్రమ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఖాదరీ పీఠాధిపతి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాషాయక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఖ్వాజా జుబేర్ హయాత్ అలీ షా ఖాదరీ పుట్టినరోజుని పురస్కరించుకొని తమ గురువు చేత ఫాతెహా నిర్వహించి, కేక్ కట్ చేయించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి దీవెనలు పొందారు. పీఠాధిపతి మాట్లాడుతూ తమ జన్మదినాన్ని నిర్వహించినందుకు విచ్చేసిన భక్తులందరికీ ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్ రబ్బుల్ ఇజ్జత్ కరుణ కటాక్షాలు ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టీలు, తిరుపతి ఏ1క్యాటరింగ్ ప్రొప్రైటర్ ఎస్ మస్తాన్ సాహెబ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాషాయక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి అబ్దుల్ రెహమాన్, మషాయాక్ అసోసియేషన్ రేణిగుంట అధ్యక్షులు రైటర్ మహబూబ్ బాషా, సత్తార్ ఖాదరీ, సుభాన్ ఖాదరీ, తిరుపతి ఫాన్సీ స్టోర్ జాఫర్, బాలాజీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ కార్యక్రమం





మల్లాపూర్ సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో సోమవారం రోజు శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద మహిళలు విశేష కుంకుమ పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం లక్ష్మీ గణపతి నామస్మరణల మధ్య మహిళలందరూ సమూహంగా కూర్చుని కుంకుమ పూజలు చేసి, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడిని వేడుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో మహిళా భక్తులతో పాటు చిన్నారులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు బండారి వెంకటేష్, తిప్పెనవేని రాజమల్లయ్య, నేతుల గంగారెడ్డి. సభ్యులు తిప్పెనవేని సుధాకర్, కలసాని రాజన్న, మ్యాకల వెంకటస్వామి, గెల్లె రాకేష్, బండారి రాజేందర్, బండారి సంజయ్, రాంచరణ్, రాహుల్, ఎట్టేం రాజు, దండికే నవీన్, నేతుల రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్లో కొండా లక్ష్మన్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన -పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు భోగ రాజేశం





రాయికల్ మండలం సెప్టెంబర్,21(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు భోగ రాజేశం, దాసరి గంగాధర్, సామల్ల సతీష్,ఆడేపు రాజీవ్, దాసరి శ్రీనివాస్,ప్రవీణ్,మారుతి, భాస్కర్, లక్ష్మీనారాయణ, రాజేష్, సాయి, కొక్కుల రంజిత్ తో పాటు కుల పెద్దలు సంఘ సభ్యులు పద్మశాలి కుల బంధువులు హాజరయ్యారు

మేడిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ రోడ్డు అద్వానా స్థితిలోఉందని వెంటనే సిసి రోడ్డు నిర్మించాలని..మేడిపల్లి ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతి పత్రం లో జగిత్యాల జిల్లా ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆడేపు రాజమౌళి మేడిపల్లి ప్రధాన కార్యదర్శి ఆశీర్వాద్ ఆరోపాణ



రాయికల్ మండలం సెప్టెంబర్, 21(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఆదర్శ పాఠశాల చాలా అద్వాన్న స్థితిలో ఉన్నది ఆక్కడికి వెళ్లి వచ్చేవారు విద్యార్థులు తల్లిదండ్రులు మరియు సిబ్బంది దూర భారంతో పాటుగా గుంతలతో కూడిన బురదల రోడ్లు ఇక్కడికి వచ్చి వెళ్లే వారందరినీ తీవ్ర ఇబ్బందులకు గురి అవుతూన్నరని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి మండల ప్రధాన కార్యదర్శి ఎం ఆశీర్వాద్ ఆరోపించారు ఈ రోడ్లను మరమ్మత్తులు త్వరగా చేపట్టడంతో పాటుగా వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణం చేసి నట్లయితే శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందని త్వరగా అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని కావున తగు చర్యలు సత్వరమే తీసుకోగలరని కోరుతున్నాము లేనియెడల విద్యార్థులచే ఉద్యమిస్తామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజమౌళి మేడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఆశీర్వాద్ ఒక ప్రకటనలో తెలిపారు

చింతలూరులో మహిళలతో ఘనంగా కుంకుమ పూజ,అన్నప్రసాదం వితరణ



రాయికల్ మండలం సెప్టెంబర్,21 (రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామ మహిళలతో కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ మంత్రోచ్ఛారణల మధ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మమ్మల్ని చల్లగా చూడు గణపయ్య"అంటూ స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్ మాజీ సర్పంచ్ వోరుగంటి మోహన్ రావు ఆలయ చైర్మన్ మక్కల సాయికుమార్ అనుపురం గంగాధర్ వార్డు సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



మల్లాపూర్ సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)మల్లాపూర్ మండల కేంద్రంలో రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రోజు రెడ్డీస్ యూత్ నిర్వాహకుల ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద మహిళలు విశేష కుంకుమ పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం యూత్ సభ్యుల పర్యవేక్షణలో స్థానిక మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులలో హాజరై, లక్ష్మీగణపతి నామస్మరణల మధ్య సమూహంగా కూర్చుని కుంకుమ పూజలు చేశారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడిని వేడుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో మహిళా భక్తులతో పాటు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాలు విజయవంతం అయ్యేలా రెడ్డీస్ యూత్ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పూండ్ర శ్రీనివాస్ రెడ్డి, ఏలేటి రాజ రెడ్డి, పూండ్ర లక్ష్మా రెడ్డి, ఎల్లాల లక్ష్మా రెడ్డి, అల్లూరి రాకేష్ రెడ్డి, కొప్పెల మహేష్ రెడ్డి, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి(ఏ.వీ.ఆర్) మరియు యూత్ సభ్యులు పాల్గొన్నారు

వీరాపూర్ 4, 6వ వార్డుల సమస్యలు పరిష్కరించాలి.

ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి...



రాయికల్ మండలం సెప్టెంబర్,21(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వీరాపూర్ గ్రామంలోని 4వ, 6వ వార్డుల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా వార్డుల గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. 4వ వార్డులో సుమారు 45 మంది ఓటర్లు నివసిస్తున్న ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా పలు మౌలిక వసతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు

ముఖ్యంగా సోమ ధర్మయ్య ఇంటి నుంచి జవ్వాజి శ్రీనివాస్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. వర్షాకాలంలో డ్రైనేజీ లేక నీరు ఇళ్ల పరిసరాల్లో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ మురికి నీరు ఆగడం వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయని వారు పేర్కొన్నారు

అదేవిధంగా 6వ వార్డులోని ఆరోవాడ మహేంద్ర నగర్ కాలనీలో మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోని ఇళ్ల వరకు సరైన డ్రైనేజీ లేక వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోతున్నాయని తెలిపారు. రెండు వార్డుల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతుల పనులను త్వరితగతిన చేపట్టేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో చెదల శంకర్, జవ్వాజి శ్రీనివాస్ గౌడ్, కనికరపు స్వామి, నీలి మల్లయ్య, సోమ రాములు,



సోమ బుచ్చన్న, సోమ వరలక్ష్మి, సోమ రాజు, సోమ నవ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు దుర్భాషలు, బెదిరింపులు చాలా బాధాకరం

:తోట శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు.

మల్లాపూర్ సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)

కాంగ్రెస్ పార్టీ అధికార అహంతోనే మాజీ ఎంపీపీ నల్ల రాజన్న జర్నలిస్టులను దుర్భాషలాడుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ మల్లాపూర్ మండల అధ్యక్షులు, రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్ ఆరోపించారు.

మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో తన సతీమణి లక్ష్మీ ఎంపీటీసీగా ఉన్న సమయంలో కూడా ఒక పత్రిక విలేఖరి తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే కారణంతో, అప్పటి ఎంపీపీగా ఉన్న నల్ల రాజన్న కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆ పత్రికను మండలవ్యాప్తంగా బహిష్కరించాలని నిర్ణయించిన ఘటన ఉందని గుర్తు చేశారు.

ప్రస్తుతం కూడా జర్నలిస్టుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ, దుర్భాషలు మరియు బెదిరింపులకు పాల్పడటం బాధాకరమని తోట శ్రీనివాస్ అన్నారు. నల్ల రాజన్న జర్నలిస్టులకు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ వ్యవహారంపై స్పందించి ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో వారు కీలకంగా పనిచేస్తారని తోట శ్రీనివాస్ అన్నారు. గతంలో తాము పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలోనూ జర్నలిస్టుల సలహాలు, సూచనలను గౌరవిస్తూ మండల అభివృద్ధి కోసం అన్నదమ్ముల్లా కలిసి పనిచేశామని గుర్తుచేశారు.

ప్రస్తుతం మండలంలో అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలితో గ్రామ, మండల స్థాయి అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రవర్తిస్తే రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.



బిఆర్ఎస్ పార్టీది సమానత్వ సంస్కృతి

బిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే అయినా, మండల అధ్యక్షుడు అయినా, గ్రామ సర్పంచ్ అయినా పదవిలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజల పట్ల, జర్నలిస్టుల పట్ల మర్యాదగా వ్యవహరించుకోవడం తమ పార్టీ సంస్కృతి అని తోట శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో పదవుల ఆధారంగా ఆంక్షలు లేకుండా అందరం కలిసి కూర్చుని కార్యకర్తలతో కలిసి పనిచేసే సంప్రదాయం తమ పార్టీలో ఉందన్నారు.

అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో పదవిలో ఉన్నవారిని పక్కన పెట్టి, పదవి లేని వారు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసుకుని అధికారాన్ని చెలాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. "పదవులు ఒకరికి.. కుర్చీలు మరొకరికి" అన్న విధానం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదని అన్నారు.

ప్రజలే తగిన సమాధానం చెబుతారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని తోట శ్రీనివాస్ అన్నారు. మండలంలో కొనసాగుతున్న ఈ అరాచక పాలనకు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలే తమ ఓటు ద్వారా సమాధానం చెబుతారని అన్నారు.

మండలంలో అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని తోట శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల పట్ల అనుచితంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, రాఘవపేట ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కదుర్క నర్సయ్య, వైస్ చైర్మన్ శరత్ గౌడ్, మాజీ సర్పంచ్ గోవింద్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు జెల్ల ప్రసాద్, కల్లెడ గంగాధర్, నాయకులు క్యాతం నరేష్, తోట్ల మహేందర్, సతీష్, రఫీ, న్యామతాబాద్ రాజు, డ్యాగ గంగారెడ్డి, కొంపల్లి రాజు, మకిలీ రాకేష్, రంగు రామ గౌడ్, సురకంటి తిరుపతి రెడ్డి, బాస రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గని యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం



మల్లాపూర్ సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలోని గని యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులలో భాగంగా నిష్టతో భక్తి శ్రద్ధలతో పూజలు జరిపి అనంతరం

మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యూత్ సభ్యుల సమిష్టి కృషితోటే ఇంతటి మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశామని తెలిపారు. దానితోపాటు వినాయక నిమజ్జనం విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటామని డీజే లకు తగిన దూరాన్ని పాటిస్తూ విద్యుత్తు తీగల విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు కూడా ఆదర్శంగా ఉంటామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కారపు నాగేంద్ర, జలంధర్, ఇట్టేడి రాజశేఖర్, బుర్ర గడ్డ రాజేష్, బక్కూరి హరీష్, నాగరాజు, రాజేశ్వర్, నరేందర్, అబ్బూరి నాగార్జున, రాకేష్, సీమల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, మైతాపూర్ మధ్యలో గల వాగులోకి డి52 కెనాల్ నీటిని విడుదల చేయాలని.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కోరిన మైతపూర్ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్



రాయికల్ మండలం సెప్టెంబర్,21(రిపబ్లిక్ న్యూస్)

వినాయక నిమజ్జన సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మైతాపూర్ రోడ్డామ్ వాగులో నీరు లేనందున రాయికల్ మరియు మైతపూర్ గ్రామాల వినాయకుల నిమజ్జనానికి అలాగే ప్రజల సౌకర్యార్థం కొరకు డి52 ద్వారా ఎస్ఆర్ఎస్పీ నీటి విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కి వినతిపత్రం సమర్పించిన మైథాపూర్ గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రయత్నిస్తానని వాగ్దానం చేశారు ఎందుకంటే వినాయకుల నిమజ్జనం రాయికల్ వాళ్ళు మైతాపూర్ వాగు లోనే నిమజ్జనం చేస్తారని తప్పనిసరిగా డి52 ద్వారా నీళ్లు విడుదల చేయాలని రాయికల్ ప్రజలు మైతపూర్ గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ కోరారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పోలీస్ ఉద్యోగాల కోసం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఈ నెలాఖరు 30వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు కు గడువు

సిఈడిఎం ద్వారా ఉచిత శిక్షణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 21(రిపబ్లిక్ న్యూస్) :
రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్,సబ్ ఇన్స్పెక్టర్ ల నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ద్వారా ఆఫ్ లైన్, ఆన్ లైన్ విధానంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే అర్హత కలిగిన వారికి శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులకు ఆహ్వానం పలకడం జరిగిందన్నారు. తుది గడువు ఈ నెలాఖరు 30వ తేదీ లోపు ఆన్ లైన్ ద్వారా సిఈడిఎం వెబ్ సైట్ లో దరఖాస్తులు పంపాలని కోరారు. ఆఫ్ లైన్ ఉచిత శిక్షణకు తప్పనిసరి అర్హతగా బిపిఎల్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు.దరఖాస్తు సమయంలోనే సంబంధిత బిపిఎల్ కార్డు (తెల్ల రేషన్ కార్డు / ధృవీకరణపత్రం)సమర్పించాలని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో చేరాలని ఆకాంక్షించే, పట్టుదల కలిగిన మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే సిఈడిఎం ఉచిత శిక్షణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. పోలీసు ఉద్యోగాలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, నియామక పరీక్షకు నిర్దేశించిన, సంబంధిత అన్ని అంశాలపై దృష్టి సారించి తర్ఫీదును పూర్తిస్థాయిలో ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రి సూచించారు.అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను "సిఈడిఎం-ఏపీ" అధికారిక వెబ్ సైట్ ద్వారా తమకు సంబంధించిన అన్ని పూర్తిగా వివరాలతో వెబ్ సైట్: **www.apcedmmwd.org** లో నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు: 08645-297535, 7386789966 లకు సంప్రదించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగానే కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా విడుదల చేస్తున్న జాబ్ నోటిఫికేషన్ల లో మైనారిటీ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. పోలీస్ శాఖలో నియామకాల కోసం నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న దృష్ట్యా మైనారిటీ నిరుద్యోగ యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకొని విజయం సాధించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు.

బంగారు అంగళ్ళ వీధిని విస్తరించుకుంటే ఉద్యమం చేస్తాం



నంద్యాల సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్) :
బంగారు అంగళ్ళ వీధిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సూర్య సేన చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. బంగారు అంగళ్ళ వీధికి సమీపంలో పెద్ద మార్కెట్, ఒకపక్క పప్పుల బట్టి బజార్, మరోపక్క బైరమల్ వీధి ఉండడంవల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఉదయం పూట ఆఫీసులకు, షాపులకు వెళ్లాలన్న, అలాగే విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలన్న ట్రాఫిక్ సమస్యలకు ఇబ్బందులు పడుతూ సమయానికి వెళ్లలేకపోతున్నామని వారు బాధపడుతున్నారు. అలాగే అత్యవసర పరిస్థితులలో వైద్యం చేయించుకోవాలన్నా అంబులెన్స్ రావాలన్నా పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్ చేదించి బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే కొంతమంది ప్రజలు మృత్యువాత పడుతున్నారని ప్రజలు కలత చెందుతున్నారు. ఇంత జరుగుతున్న నాయకులు మాత్రం తమకు అనుకూలమైన వారికి లబ్ధి చేకూర్చడం కోసం మాస్టర్ ప్లాన్ అప్రూవల్ ఉన్న రోడ్ల విస్తరణ పనులు చేయడం లేదని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. తాము తిరిగి సూర్య సేన తరపున కార్యక్రమాలు చేస్తున్నామని తెలియగానే కొంతమంది ప్రజలు గతంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని క్రియేటివ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తాము చేసిన ర్యాలీలు, ధర్నాలు, పోరాటాల గురించి మాకు తెలియజేస్తూ ఇప్పుడు కూడా అలాగే కార్యక్రమాలు చేయాలని మమ్మల్ని కోరుతున్నారు. కావున నాయకులను, అధికారులను మేము అడిగేది ఏమంటే బంగారు అంగళ్ళ వీధిలో రోడ్ల విస్తరణ పనులు చేస్తారో లేదో సూటిగా చెప్పండి అని మేము ప్రశ్నిస్తున్నామన్నారు. లేకపోతే మేము ప్రజలతో కలిసి విస్తరణ పనులు ప్రారంభించే వరకు ఎందాకైనా పోరాడతామని మీకు తెలియజేస్తున్నాము. అంతవరకు గతంలో తాము చేసిన రోడ్ల విస్తరణ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా మీ ముందుకు తీసుకొస్తాం అని దేరంగుల చంద్రశేఖర్ తెలిపారు.

సమాజ సంస్కరణకు గురజాడ రచనలు చిరస్థాయి స్ఫూర్తి

గురజాడ ఆశయాలను ఆచరణలో పెడదాం - ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేద్దాం

తరతరాలకు స్ఫూర్తినిచ్చే మహాకవి గురజాడ - ఘనంగా 164వ జయంతి వేడుకలు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)
మహాకవి గురజాడ వెంకట అప్పారావు సాహిత్యం నేటికీ సమాజంలో చైతన్యం, సంస్కరణలకు స్ఫూర్తినిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గురజాడ రచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గురజాడ రచించిన 'కన్యాశుల్కం', 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' వంటి రచనలు బాల్య వివాహాలు, సామాజిక రుగ్మతలు, మహిళల సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించాయని కలెక్టర్ తెలిపారు. విజయనగరం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, అక్కడ గురజాడ 150వ జయంతి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించే అవకాశం తనకు లభించిందన్నారు. గురజాడపై సేకరించిన సమాచారంతో కవులు, రచయితల వ్యాసాలతో పుస్తకాలను రూపొందించి గ్రంథాలయాలకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. 'దేశమును ప్రేమించుమన్నా' గేయంలోని సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని, ముఖ్యంగా ముందుకు సాగాలనే గురజాడ ఆశయం పరిపాలనలోనూ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అన్నారు. గతంలో పనులు జరగలేదని నిరుత్సాహపడకుండా, అనుభవాలను పాఠాలుగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా నిస్వార్థంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, జిల్లాధికారులు, సిబ్బంది పాల్గొని గురజాడ అప్పారావుకు ఘనంగా నివాళులర్పించారు.

పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమగ్ర కార్యాచరణ

అధికారులు శాఖల వారీగా పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి - కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగం తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.శ్రీ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద మొదటి త్రైమాసిక వ్యయాన్ని 100 శాతం బుక్ చేసి, తదుపరి నిధుల వినియోగానికి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ డిసెంబర్ నాటికి గణనీయమైన పురోగతి సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల ద్వారా ఐటీఐల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి మంజూరైన పార్కుల్లో రోడ్లు, నీరు, పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల పనులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి జిల్లాలో నిలిచిపోయిన, అసంపూర్తిగా ఉన్న సుమారు 15 వేల గృహాలను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. టిడ్కో ఇళ్ల పనులను వేగవంతం చేసి, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి హోల్డ్ రిసార్ట్స్, రెవెన్యూ సైట్లు, రోడ్‌సైడ్ సౌకర్యాలకు సంబంధించిన భూ ప్రతిపాదనలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో నంది ఫెస్టివల్, బెలూం ఫెస్టివల్ వంటి స్థానిక ఉత్సవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలంలో శాశ్వత హెలిప్యాడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రానికి హెలిపోర్ట్ లేని నేపథ్యంలో హెలిపోర్ట్ కోసం 10-15 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జలధార ఫేజ్-2 పనులతో పాటు మొక్కల పెంపకం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్ పిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, అమృత్ మరియు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అధికారుల సమన్వయంతో నీటి వనరులను సుందరీకరించాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల అభివృద్ధి, ఆటిజం సెంటర్ల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, వన్‌స్టాప్ సెంటర్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

సెప్టెంబర్ 25 న జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనతను తగ్గించడంతో ఆరోగ్యకరమైన శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుంది

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల, బ్యూరో సెప్టెంబర్ 21 (రిపబ్లిక్ న్యూస్)
సెప్టెంబర్ 25వ తేదీన జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. సోమవారం ఉదయం పీ జీ ఆర్ఎస్ హాలు నందు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పై జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదా బాయి, జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల సమగ్ర శారీరక, మానసిక ఎదుగుదలకు, ఆరోగ్యకరమైన బాల్యానికి నులిపురుగుల నివారణ ముఖ్యమైందనీ,ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖ, మున్సిపల్ పరిపాలన శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుని అర్హులైన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 4613 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలు డిగ్రీ కళాశాల పరిధిలోని సుమారు 4,46400 మంది పిల్లలు విద్యార్థులకు నివారణ మాత్రలు అందించడమే కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు 200 మి.గ్రా. సగం మాత్రను బాగా పొడి చేసి, నీటిలో కలిపి తాగించాలి. 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 మి.గ్రా. నమిలి మింగేలా చూడాలన్నారు. ఖాళీ కడుపుతో కాకుండా భోజనం చేసిన తర్వాత మాత్రమే మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. నులు పురుగులు నివారణ మాత్రమే తీసుకోవడంతోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశు భ్రతను పాటించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఆయా విద్యా సంస్థలు పంపిణీ చేసిన మాత్రల వివరాలను ఏఎన్ఎం, ఎంపీడీవో లాగిన్ లో కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు లేదా అంగన్‌వాడీ కార్యకర్తల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే పిల్లలకు అక్కడికక్కడే మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు తీసుకున్న అనంతరం పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు అవసరమైన వైద్య సిబ్బంది, వైద్య పరీక్షల సౌకర్యాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు సాధారణంగా సురక్షితంగా ఉపయోగించ బడుతున్నప్పటికీ, నులిపురుగుల భారం ఎక్కువగా ఉన్న కొంతమంది పిల్లల్లో మాత్ర తీసుకున్న అనంతరం స్వల్పంగా వికారం, కడుపునొప్పి లేదా వాంతులు వంటి అసౌకర్యాలు కనిపించే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి సందర్భాల్లో భయపడకుండా వెంటనే అక్కడి వైద్య సిబ్బందినీ సంప్రదించాలన్నారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనతను తగ్గించడంతో పాటు పోషకాహార స్థితి, ఏకాగ్రత మరియు ఆరోగ్యకరమైన శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుందని అధికారులు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలకు సెప్టెంబర్ 25న నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా పూర్తి సహకారం అందించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయి అధికారులు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మధ్యాహ్న భోజనం సమయంలో స్వయంగా పాల్గొని పిల్లలందరికీ నులు పురుగుల నివారణ మాత్రలు అందేలా చూడాలని తెలిపారు. కావున జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన పిల్లలందరికీ మాత్రలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్ను ఆవిష్కరించారు.

ప్రజా దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలి

పిజిఆర్ఎస్‌కు 362 దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 21 (రిపబ్లిక్ న్యూస్)
ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా 362 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అధికారుల పిజిఆర్ఎస్ లాగిన్‌లలో ఇప్పటివరకు పరిశీలించని 135 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఏ దరఖాస్తు కూడా ఎట్టు వ్యూ స్థాయిలో పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో ఇంకా 13 అర్జీలు పరిష్కరించాల్సి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారికి సమర్పించిన దరఖాస్తుల్లో ఒక అర్జీ ఇంకా పెండింగ్‌లో ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలను పిజిఆర్ఎస్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 170 అర్జీల స్వీకరణ

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా జిల్లాలో మొత్తం 170 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 6, అడంగల్ సవరణలకు 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించి 11, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 41, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 40, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 46, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 2 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పిజిఆర్ఎస్ ద్వారా అందిన కొన్ని దరఖాస్తులు

1)ఆత్మకూరు మండలం శ్రీరామనగర్, కప్పలగుంటకు చెందిన కళావతి తన ఆస్తి పన్ను, రిజిస్ట్రేషన్ పత్రాలు,



ఈసీ ఆధారంగా తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను మున్సిపాలిటీ పొరపాటున మరో వ్యక్తికి కేటాయించిందని, తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను తిరిగి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.
2)మిడ్తూరు మండలం వీపనగండ్లకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వేల్పుల మాణిక్యారావు, తన తల్లి పేరుతో వీపనగండ్ల గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 14లో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందున, నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.
3)నందికొట్కూరు మండలం: విద్యపోగు లక్ష్మీదేవి తన భర్త మరణించడంతో జీవనోపాధి కష్టంగా మారిందని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com